# దక్షిణం వైపు వాట


## శృంగార కథా మాలిక

తను ఫారిన్లో పుట్టి ఉంటే బాగుండేదనుకొంది రూపిణి. అక్కడైతే తన లాటి కేసు అర్థం చేసుకొంటారు. అడగ్గానే విడాకులు మంజూరు చేస్తారు. ఇక్కడ విడాకులు కావాలంటే చచ్చే చావు చావాలి. అత్తమామలుండాలి. ఇంట్లో కిరోసిన్ ఉండాలి. తండ్రి మాట తప్పి ఉండాలి. అత్తా, మామా, మొగుడూ, ఉంటే మరిదీ–వీళ్లంతా కలిసి కిరోసిన్ పోసి మంట బెట్టినా చావకుండా మిగిలితే అప్పుడు విడాకులిస్తారు.

అదీ కాకపోతే మొగుడు నపుంసకుడై యుండాలి. అధమం నర రూప రాక్షసుడై ఉండాలి. వాడు వేసిన వాతలు. కొట్టిన దెబ్బలూ కోర్టు వారి సమక్షంలో దేబిరిస్తే విడాకులు పడేస్తారు. తనలాగ 'మా ఆయన నాతో కలిసి కాపురం చేద్దామనుకొంటున్నాడు గానీ ఆయనకు శుచీ శుభ్రం లేదండి. అందువల్ల నాకు విడాకులు దయచేయించండి' అని అడిగితే ఫ్యామిలీ కోర్టు జడ్జిగారు కళ్లు తేలేస్తారు. తనకి మతిపోయిందనుకొని పిచ్చాస్పటల్‌కి పంపుతారు.

పిచ్చాస్పటల్లో వున్నా బాగుణ్ణు. సంసారం చేసే బాధ తప్పుతుంది. చట్ట ప్రకారం మొగుడికి శయ్యా సుఖం కోరే హక్కులున్నాయట. అక్కడుంటే ఆ బాధ్యత నెరవేర్చక్కర్లేదు. అలా అని తనకు సెక్సంటే విముఖత ఏమీ లేదు. ఇష్టమే. కానీ మొగుడి తీరుతెన్నులే వచ్చవు. మొదటి రాత్రి గదిలోకి వచ్చినప్పుడే తెలిసింది. మల్లెపూల వాసనను మింగేసే సిగరెట్టు కంపు. అదీ చార్మినార్. అదేమిటంటే 'నువ్వు యాడ్ ఫిల్మ్స్ చూడవూ! రఫ్‌గా ఉండే మనుషులు సంపూర్తిగా సంతృప్తి చెందేది ఘాటైన సిగరెట్టుతోనే' అని ప్రవచనం ఒకటి.

తండ్రికి సిగరెట్లు అలవాటు లేకపోవడం వలన తనకా పొగ



అలవాటు లేదు. రాత్రంతా దగ్గుతూనే వుంది. పోనీ కదాని జాలిపడలేదు. 'నువ్వే అలవాటు పడతావులే' అన్న ధీమా ఒకటి పైగా. ఆ రోజు సిగరెట్టు గురించే తిట్టుకుంది. కానీ ఆ తర్వాత అతని తక్కిన పద్ధతులు చూశాక దాని గురించి మర్చిపోయింది. మనిషికి బొత్తిగా శుభ్రం లేదు. రోడ్డు మీద నుంచి వచ్చి ఆ బూటు తోనే మంచం ఎక్కి కూర్చుంటాడు. మంచం మీదనే టిఫిన్ తినడాలు, సిగరెట్టు కాల్చడాలు, ఫ్రెండ్స్‌తో కూర్చుని పేకాటలు, అంతమంది ఎక్కి తొక్కేసిన మంచం మీద పడుకోవడం ఎలాగో వుంటుంది బాబూ అని తనంటే 'కావాలంటే దులిపేయ్, సిగరెట్టు బూడిదంతా పోతుంది' అంటూ చురుగ్గా చెప్పేస్తారు' బ్రహ్మచారి రోజుల్లో ఫ్రెండ్స్‌తో మంచం మీద భోజనాలు కూడా చేసేవారుట!

మంచం ఒకటే అని కాదు, దాని మీద మనిషీ అంతే. స్నానం గురించి పట్టింపు లేదు. ఒక స్నో, పౌడరు రాసుకోవాలని లేదు.



గడ్డం రోజూ గీసుకోవాలని అనుకోరు. అలా అని మోడల్స్‌లా అందమైన గడ్డం పెంచుకోరు. అలాగే వారం పది రోజులు వదిలేయడం, ఒకేసారి గీసేయడం, మళ్లీ పది రోజులు బూచోడిలా తిరగడం. తనకు గుచ్చుకుంటుందనే కాదు. చూడడానికే చికాగ్గా, అన్ క్లీన్‌గా కనబడతారు. జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి క్షవరం చేయించి తలంటుపోసేద్దామనిపిస్తుంది. చెప్తే అర్థం చేసుకోరు.

తను రోజుకు రెండు పూటలా స్నానం చేయకుండా ఉండలేదు. వేసవి కాలంలో మూడోసారి కూడా చేస్తుంది. 'రోజూ స్నానం చేయకపోతేనేం?' అన్న ఫిలాసఫీ మొగుడిది. తను చెప్పింది "శరీరమన్నాక కొన్ని కొన్ని అవయవాలు వ్యర్థ పదార్థాలను విసర్జించక తప్పదు. చెమట రావడం, మట్టి చేరడం అన్నీ జరుగుతాయి కదా! శుభ్రం చేసుకోకపోతే ఎలా?' అని. ఫారిన్లో వారానికోసారి స్నానం చేస్తారు. చలి దేశాల్లోనే కాదు, వేడి వున్న చోటుల్లో కూడా. వారి కేమవుతోంది? ఆవులు, గేదెలూ రోజూ స్నానం చేస్తున్నాయా? అంటూ అడ్డంగా వాదిస్తారాయన. 'పశువులకు, మనకు తేడా లేదా?' అంటే 'మనిషంటే మాట్లాడే పశువు తెలుసుకో' అంటూ వాదిస్తారు. ఎలా వేగడం?

తన వరకు తాను అశుభ్రంగా వుంటే ఏదో ముక్కుకి గుడ్డ కట్టుకొని కాలక్షేపం చేసేది. కానీ మొగుడై పోయాడే! దూరంగా మిగలగలదా? వచ్చి పక్కన చేరతాడు. ఏదో సినిమాలో చూసాట్ట. అప్పణ్నుంచి పాచి పళ్ళతోనే కాఫీ తాగడం, తనను ముద్దివ్వమని చంపడం, తానివ్వనంటే అలుగుతాడు. కోపగించుకుంటాడు. ఏం చేస్తుంది? ఇచ్చి వచ్చి మళ్ళీ పళ్ళు తోముకుంటుంది. ఆయన మాత్రం పేపరు చదివాక ఏ తొమ్మిది గంటలకో బ్రష్ చేసుకొంటాడు. రాత్రుళ్ళు తనది యమయాతన 'చెమట వాసన' అనవసరమైన రోమాలు, నోరుకంపు, కళ్ళు మూసుకుని కానిమ్మంటుంది. మళ్ళీ అది పనికి రాదు. తనూ 'ఎంజాయ్' చేయాలిట!

తను చెప్పిన ప్రకారం చేస్తే కాదంటా? అబ్బే అలా బావుండదట. కేవ్‌మన్ సెక్స్ అట. అంటే పశుప్రాయంగా రమించడం అన్న మాట. అదే నిజమైన శృంగారానుభవంట. ఈ పైపై మెరుగులన్నీ బూటకంట. శుచీ, శుభ్రం అంటూ తాపత్రయపడే నాగరీకం అసహజమైనదట. గుహల్లో వుండే మనుషులు పశు పక్ష్యాదులను చూసి ఎలా అనుకరించారో అలాగే మనమూ చేయాలిట.

'అయితే పచ్చి మాంసం తినలేక పోయారా? వండమని నన్ను చంపడం ఎందుకు? అంది తనోసారి ఒళ్ళు మండి. 'తిందును, చిన్నప్పణ్నుంచి అలవాటు చేయలేదు. అందుకే నీకు ముందునుంచే ఈ కేవ్‌మన్ సెక్స్ అలవాటు చేస్తున్నాను. ముందులో ఇబ్బంది పడినా తరువాత సర్దుకు పోతావు. ఆ తర్వాత ఎంజాయ్ చేస్తావ్" అంటారు.

అసలు తనని చూసి ఆశ్చర్య పడతారాయన. పెళ్ళయ్యేదాకా ఆ టూత్‌పేస్టు ఎడ్వర్టయిజ్‌మెంట్లు ఒత్తి హంబగ్ అనుకునే వాణ్ణి. ప్రియుడో, మొగుడో దగ్గరకు వస్తే నోటి దుర్వాసన అంటూ దూరంగా పెట్టరెవరు అనుకునే వాణ్ణి. అంటే నీలాటి వాళ్ళు వున్నారన్న మాట' అన్నాడోసారి. సగం ఆశ్చర్యంగా, సగం ఎకసెక్కంగా తనకేం జవాబు చెప్పాలో తెలియలేదు. 'ఏం దుర్వాసన వేయదా?' అని అడిగింది. 'నీదో చాదస్తం. గట్టిగా త్రేన్చినా ఏడుస్తావు. ఆవలిస్తే చెయ్యి అడ్డం పెట్టుకోకపోతే కొంప మునికి పోతుందంటావు. మనిషి మీద ప్రేమ వుంటే ఇవేమీ అడ్డురావు" అంటాడాయన. ప్రేమకీ, దీనికి సంబంధం ఏమిటి? పోనీ ఆయనన్నట్టే తనికి ఇటువంటి విషయాల్లో అనవసర పట్టింపులనుకొందాం. కానీ ఎంగిలి మాటేమిటి/



ఓ సారి వాళ్ళ అన్నగారు వచ్చాడు. కాఫీ ఇస్తే కొద్దిగా తాగి పంచదార ఎక్కువైంది. నేను షుగర్ పేషంటుని, ఇంత తాక్కూడదు. అంటూ వదిలేసాడు "పోనీ ఇలా ఇచ్చేయ్, నాకిచ్చిన కాఫీ సరిపోలేదు" అంటూ ఈయన చటుక్కున తాగేసారు. తనకి అసహ్యం వేసింది. కొద్ది సేపయ్యాక ఆయన వెళ్లాక, ఈయన తనని ముద్దాడబోయేరు. "వెళ్ళి నోరు కడుక్కురండి" అని బలవంతం చేసింది కూడా "మీ నోట్లో మీ అన్నయ్యగారి ఎంగిలి వుంది కదా. ఆయన ముద్దు పెట్టినట్టవదూ" అని.

కారణం చెప్పాక తను ఇంకా లోకువై పోయింది. "ఏమిటీ, వాడి ఎంగిలి ఇంకా కూచుందా? అది పొట్టలోకి ఎప్పుడో వెళ్ళిపోయి వుంటుంది. అయినా చిన్నప్పటి నుంచి వాడూ, నేనూ ఒకరి ఎంగిలి మరొకడు తినే వాళ్లం. కొంత మంది ఫ్రెండ్స్ ఎంగిలి ఇప్పటికీ తింటాను. అప్పుడు ఎన్నోసార్లు ముద్దు పెట్టించుకున్నావు. ఇవాళ ఇది నీ ఎదుట జరిగింది కాబట్టి వద్దంటున్నావు. ఆ మాట కొస్తే హోటల్లో, ఫంక్షన్లలో ఎంతమంది ఎంగిలి తింటామో! అసలు ఎంగిలి మన ఇండియాలో తప్ప వేరే ఎక్కడాలేదు తెలుసా? నీ చాదస్తం మాన్పడానికైనా ముద్దు పెట్టుకు తీరాలి. సెక్స్ అనేది బై నేచర్ కోర్స్ అనీ 'రా' అనీ తెలుసుకో. "అంటూ బలవంతాన్న ముద్దు పెట్టుకున్నారు. తనకు వాంతి వచ్చినంత పనయింది. తన మొహం చూసి వుండూ నీ పని చెప్తా' అన్నారు.

ఆ వేళ రాత్రి నాటు సారా తాగి వచ్చారు. ఫ్రెండ్స్ ఎంగిలి చేసినది కూడట. గొప్పగా చెప్పారు. "నోటి జోలికి రాకండి. మిగతా ఒళ్ళంతా ఏం కావాలంటే అది చేసుకొండి. తర్వాత డెట్టాల్ పెట్టి కడుక్కొంటా" అంది తను కానీ వినందే తనకు బుద్ధి చెప్పి సరైన దారిలో పెట్టాలిట. ముద్దు పెట్టేసారు. తనకు నిజంగా వాంతి వచ్చేసింది. జాలి పడక పోగా 'మూడంతా పాడయింది' అంటూ తిట్లు.

ఆ సంఘటన తర్వాత తను అలిగి గోల చేయడంతో కాస్త ఉధృతం తగ్గింది. తిట్టుకుంటూనైనా తాను చెప్పిన ప్రకారం చేస్తున్నారు. అదీ మొక్కుబడిగానే తన ఎదురుగానే ఆయనకుచీటి మీద బొత్తిగా 'కన్విక్షన్' లేదన్న సంగతి ఇవాళ పొద్దున తెలిసింది.

తెల్లవారు ఝామున మూడున్నరికి ఎవరిదో ఫ్రెండ్ పెళ్ళి. తనొక్కరు వెళ్తానన్నారు. మూడు గంటలకు లేపమన్నారు. కానీ అలారం సరిగ్గా మోగలేదు. మూడుం పావుకి హఠాత్తుగా మెలుకువ వచ్చి లేపితే ఆదరా బాదరగా, మొహమైనా కడుక్కోకుండా బట్టలేసుకుని సైకిలెక్కారు. తను నిద్ర పోయింది. నాలుగున్నరకు తిరిగొచ్చారు.

తలుపు తీయగానే తనను పట్టుకుని మంచం మీదకు తీసుకొచ్చి మంచం ఎక్కేసారు. "అదేమిటి? బట్టలు మార్చుకోరు? వీధిలో

తిరిగిన బట్టలతో కాళ్ళు కడుక్కోకుండా మంచం ఎక్కేయడమే?" అని తను అంటున్నా వినిపించుకోకుండా తనని ఆక్రమించుకో పాగారు. అక్కడ పెళ్ళిలో సీతాకోక చిలకలని ఎవరైనా చూసి మూడ్‌లోకి వచ్చేసి వుంటారు. ఆ తాపం తగ్గేదాకా ఊరుకోరేమీ అనుకొని ఆ మాటనే అడిగింది. 'ఏడిశావులే, ఇలాంటి ప్రశ్నలు ఇక అడక్కుండా నోరు మూసేయ్యాలి' అంటూ వంగబోతే తను అభ్యంతరపెట్టింది" పళ్ళు తోముకోలేదు, పెళ్ళివారిచ్చిన కాఫీ తాగేసి కూడా వచ్చారు. పైగా ఇదొకటా" అనబోతున్న వినిపించుకోలేదు.

అంతా అయ్యేక ఆయన గుర్రుకొట్టి నిద్రపోతుంటే తనకు ఏడుపు వచ్చింది. విడాకులు తీసుకోవాలనిపిస్తోంది. ఏమిటీ మనిషితత్వం? తనకు తోచదు. చెబితే వినరా? తనది చాదస్తమే కావచ్చు. చెబితే అర్థం చేసుకోవద్దా? సర్దుకుపోవద్దా? తన ఇష్టాయిష్టాలు గణించ వద్దా? పెళ్లయితే చాలు పార్టనర్ శరీరాన్ని ఎలా పడితే అలా వాడుకునే సర్వహక్కులు సిద్ధిస్తాయా? భార్యకూ అలాంటి హక్కు లుంటాయా? తనూ చింపిరి జుట్టేసుకుని తల బరుక్కుంటూ, ఒళ్ళు గీరుకుంటూ తయారయితే? ఇదే 'ఆదిమే ప్రేమ, అసలైన ప్రేమ' అంటే? తను అలా వేషం వేయగలదా?

◐ ◐ ◐

భార్య చెప్పినది చలానికి ఇంట్రస్టింగ్‌గా తోచింది.

ఆవేళ రూపిణి చెప్పింది "మన పడమటి వైపు వాటాలో కొత్తగా దిగారు చూసారు. వనజ గారిని ఆవిడ భర్త సినిమా కంపెనీ వాళ్ళకు ఫైనాన్స్ ఇస్తుంటాడట. ఓ సినిమా కంపెనీ వాళ్ళు షూటింగ్ తీద్దామని ఊటొచ్చారట. ఏదో డాన్సు సీక్వెన్సు షూటింగ్ వుందంట. "మీ వారి పెర్సనాలిటీ బాగుంటుంది కదా! ఏదైనా ఇంట్రస్టెడా?' అని అడిగిందావిడ".

"డాన్స్ చేయడం అంటే హీరో హీరోయిన్ల వెనక గెంతేవాళ్ల లాగా?"

"ఛ ఛ అదికాదండి. ఏదో క్లబ్బు సీనట. హీరో హీరోయిన్లు పాట పాడుకుంటూంటే వెనకాల అయిదారు జంటలు ఇంగ్లీషు వాళ్ళ డాన్సులాటిది చేస్తారట. కాస్త గాఢంగా కౌగిలించుకుని ఊగుతుం టారుగా, అలాగేమో రఫ్ టైఫ్ మొగాళ్లు కావాలని చూస్తున్నారేమో, గాఢ ప్రేమ కదా. అందుకే మీ గురించి అడిగారనుకొంటా"

"చూసావా? నేను చెప్పలా? మాకు వైల్ ఫీచర్స్ అంటే రఫ్‌గా వుండాలి. సినిమాలో హెలెన్ డాన్సులు చూడు. తుమ్మ మొద్దులా, నీగ్రోలా వున్న వాణ్ణి పట్టుకొని వేళ్లాడుతుంది కానీ నాజుగ్గా ములక్కాడలా వున్న వాడికేసి తిరిగి కూడా చూడదు.

"బాబూ, మీ థీరీల కో దణ్ణం. అడిగేరు. ఇష్టమైతే చేయండి. లేదంటే ఊరుకోండి. లెక్చర్లొద్దు".

"పోన్లే, దానికేముంది, ఓ సారి చేసి చూద్దాం. నీకేమీ అభ్యంతరం లేదన్నప్పుడూ ట్రై చేయడంలో తప్పేముంది. షూటింగెప్పుడట?"

"ఎల్లుండి పొద్దున్న ఏడున్నరకి. రామారం జమీందారుగారి బంగళా అద్దెకు తీసుకున్నారట. ఆ హాల్లోనే డాన్సు సీను తీస్తారట"

షూటింగ్ నుంచి తిరిగొస్తూనే చలం తలంటుకొని స్నానం చేశాడు 'ఏమీ తినకుండా, తాగకుండా మంచం మీద వాలేడు'.

"ఏం అలా వున్నారు? మీ వేషం తీసేసారా?" అని అడిగింది రూపిణి.

"తీసేసినా బాగుండును. ఆ దరిద్రం తప్పేది. వాంతులు రావడం ఒక్కటే తక్కువ".

"ఏమయింది?"

"ఏం చెప్పమంటావ్? నాతో బాటు డాన్స్ చేసిన ఆర్టిస్టు ఆ టైపనుకొంటాను. మనిషి బాగుంటుందిలే. రాత్రంతా చేరాలొస్తే సుకుంటుంది. అసలే మన వాళ్లకి సినిమా వాళ్లంటే వెర్రి. ఏ మెద్రాసో హైదరాబాద్ వెళ్ళక్కర్లేకుండా ఇక్కడే దొరుకుతుందంటే క్యూలో నిలబడి పోయి వుంటారు. గొప్పలు పోడానికో, కస్టమర్లను ఖుషీ చేయడానికి చెర తాగేసింది. ఒకటే వాసన. 'షూటింగ్‌కి వచ్చేదాకా కార్యక్రమాలు సాగాయేమో కళ్ళు, పళ్ళు, వళ్ళు ఏదీ కడుక్కోకుండా మొహం మీద పౌడరు అద్దేసుకొని తయారయి పోయింది. ఆ డాన్సు డైరెక్టరు గారు అక్కడ మొహం పెట్టు. ఇక్కడ మొహం పెట్టు అంటాడు నన్ను. చీదర పుట్టినా మొహం మాత్రం తన్మయత్వంలో మునిగి తేలినట్టు పెట్టాలిట. మధ్యలో వచ్చేస్తానంటే బాగుండదని ముక్కూ, నోరూ మూసుకుని భరించి వచ్చాను. గొప్ప మహాతల్లి దొరికిందిలే".

'మీరు కేవ్‌మన్ కదాని మీకు జోడీగా కేవ్ వుమెన్‌ను వెతికి కుదిర్చారేమో" అంది రూపిణి నవ్వు ఆపుకుంటూ.

చలానికి కోపం వచ్చింది. "ఏం వేళాకోళంగా వుందా? నేనంత అసహ్యంగా వుంటానా?" అంటూ చివ్వున లేచాడు.

"తనదాకా వస్తే కానీ ఎవరికీ తెలియదు లెండి...." అంటూ జారుకుంది రూపిణి.



వెళ్లాళ్ళు తిర్కుండానే భర్తలో కనబడిన మార్పుకి సంతోషించింది రూపిణి. తన లాజిక్ పని చేసింది. వనజ గార్ని బతిమాలి మొగుడికి వేషం ఇప్పించినప్పుడే అనుకొంది. ఇలాంటి ఆర్టిస్టు ఎవరో తగులుతుందనీ, మొగుడికి బుద్ధి వచ్చి తీరుతుందనీ, తన అంచనా తప్పలేదు' అని సంబరపడింది.

ఇదీ రూపిణి కథ. అర్నెల్ల తర్వాత తిరిగొస్తే మరొకరు.

(వచ్చేవారం ముగింపు కథతో వాటాకు టాటా)



★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
కేవలం రూ.300/ - లకే ఆకర్షణీయమైన
జపాన్‌మోడల్ 8 సం. లు గ్యారంటీ
మా స్కీము ద్వారా కేవలం రూ.300/-లకే
లభ్యం. పోస్టేజి అదనం.
MAHADEV TRADING CO.
P.O. MAIRA BARITH (GAYA)

ఆటోమేటిక్ టాయ్ రివాల్వర్

MARSHAL ZORO
Rs. 175/-
పోస్టల్ ఛార్జీలు అదనం
50 షాట్లు ఉచితం

BULLET ZORO
Rs. 270/-
పోస్టల్ చార్జీలు అదనం
★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
★ లైసెన్స్ అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మరక్షణ కొరకు
మార్షల్ జోరో మరియు బుల్లెట్ జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణనిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు ప్రయాణాలలో మరియు జంతువుల బారి నుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ పేలే తుపాకి. వెంటనే మీ ఆర్డర్లను పంపించండి.
ISHWAR TRADERS (I)
P.O. MAIRA BARITH (Gaya)